# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



PM ప్రజా ముచ్చట తెలుగు దిన పత్రిక

విలేకర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు 99086 89674 లో సంప్రదించగలరు



హైదరాబాద్ | మంగళవారం,జూన్3,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1


## పోలీసుల విధులకు ఆటంకాలు కలిగించవద్దు

- గంజాయి బ్యాచ్ ఇంటికి జగన్ వెళుతున్నారు: అనిత
- తెనాలి ఘటనకు రాజకీయ రంగు పులుముతున్నారన్న అనిత
- రాజకీయ లబ్ది కోసం జగన్ యత్నిస్తున్నారని మండిపాటు
- పోలీసుల విధులకు ఆటంకాలు కలిగించవద్దని సూచన



## తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని

- ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- రాష్ట్రం ఏర్పడి 11 యేళ్లు పూర్తి
- తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా, సాంకేతికంగా అభివృద్ధి సాధిస్తోంది
- ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజలకు పలువురు ప్రముఖుల శుభాకాంక్షలు





తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం. 2014 జూన్ 2న తెలంగాణ ఏర్పడిన విషయం తెలిసిందే. దీంతో నేటితో రాష్ట్రం ఏర్పడి 11 యేళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

## తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ అణచివేసింది

- తెలంగాణ జీడీపీతో పోలిస్తే తక్కువ ఉన్నా..
- తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రత్యేక లరి రాష్ట్రం ఇచ్చారని వ్యాఖ్య
- కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలన నిరంకుశంగా సాగిందన్న ఈటల
- అమరుల కుటుంబాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు
- రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా



జూన్2,(ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణ జీడీపీ, తలసరి ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ, ఏపీ అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చెందుతుంటే, తెలంగాణ మాత్రం వెలవెలబోతోందని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని 'పెద్దన్న' అంటూ ప్రశంసించి, రాష్ట్రానికి తిరిగి వచ్చిన తర్వాత విమర్శలు చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు.సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ అణచివేసిందని, చివరికి తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించిందని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.



## రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం...

### - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



- పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన వ్యవస్థలను చక్కదిద్దుతున్నామన్న ముఖ్యమంత్రి
- మహిళలకు క్యూఆర్ కోడ్‌తో ఉచిత వైద్య పరీక్షల పథకం ప్రకటన
- కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యమన్న రేవంత్
- ప్రజల ఆకాంక్షలే మా అజెండా.. వ్యవస్థల ప్రక్షాళనే ధ్యేయం: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,జూన్2,(

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము అధికార పగ్గాలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర గందరగోళంలో ఉందని, గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన అనేక కీలక వ్యవస్థలను ప్రస్తుతం చక్కదిద్దే పనిలో నిమగ్నమయ్యామని తెలిపారు. ఈరోజు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.



## అమెరికా డాలస్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

- నాలుగు కోట్ల మంది ఆకాంక్షను కేసీఆర్ నెరవేర్చారు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మూడేళ్లలో కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రి అవుతారని జోస్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఒంటిరి పోరాటం చేశారని, ఎన్నో అవమానాలను ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అమెరికాలోని డాలస్ నగరంలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు, బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను మహాత్ముడి స్ఫూర్తితో కేసీఆర్ నెరవేర్చారని కొనియాడారు.2023 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, తెలంగాణ ప్రజల పట్ల తమ ప్రేమ ఏమాత్రం తగ్గలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూడేళ్లలో కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎంతో మంది ప్రాణత్యాగాలు, దశాబ్దాల పోరాటాల ఫలితంగా తెలంగాణ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణకు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అదే పట్టుదలతో, స్ఫూర్తితో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

## కాళేశ్వరం విచారణ: కేసీఆర్ హాజరు తేదీలో మార్పు..

- కాళేశ్వరం కమిషన్ ముందు కేసీఆర్ విచారణ అంశం
- జూన్ 5కు బదులుగా జూన్ 11న హాజరుకానున్న కేసీఆర్
- - జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్
- కేసీఆర్ విజ్ఞప్తి మేరకు తేదీని మార్చిన కమిషన్



కాళేశ్వరం విచారణ: కేసీఆర్ హాజరు తేదీలో మార్పు.. ఎందుకంటేకాళేశ్వరం ప్రాజెక్టు అంశాలపై విచారణ జరుపుతున్న జ్యుడీషియల్ కమిషన్ ఎదుట మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యే తేదీలో మార్పు చోటు చేసుకుంది. ఆయన చేసిన అభ్యర్థన మేరకు కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది.తెలంగాణ ప్రభుత్వం నియమించిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్, విచారణలో భాగంగా కేసీఆర్ ను హాజరు కావాలని గతంలో ఆదేశించింది. ఈ మేరకు తొలుత జూన్ 5వ తేదీని ఖరారు చేసింది. అయితే, ఆ తేదీన హాజరు కాలేనని, వేరే తేదీని కేటాయించాలని కేసీఆర్ కమిషన్‌ను కోరారు.కేసీఆర్ చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన కాళేశ్వరం కమిషన్, విచారణ తేదీని మార్పు చేసింది. జూన్ 5వ తేదీకి బదులుగా జూన్ 11వ తేదీన కమిషన్ ముందు హాజరుకావాలని సూచించింది. దీంతో కేసీఆర్ జూన్ 11న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరై కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలపై వివరణ ఇచ్చే అవకాశం ఉంది.



## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో తేనీటి విందు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. తాజా ప్రపంచ సుందరి ఓపల్ సుచాత నేతృత్వంలోని సుందరీమణుల బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.గవర్నర్ ఇచ్చిన ఈ తేనీటి విందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ సహా పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖులు, ఉన్నతాధికారుల కలయికతో రాజ్‌భవన్ ప్రాంగణం సందడిగా మారింది.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణలు**

పెన్ పహాడ్ /ప్రజా ముచ్చట, జూన్ 02:పెన్ పహాడ్ మండల కేంద్రం తో పాటు మండల వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ధరావత్ లాలు నాయక్,స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ కస్తాల గోపికృష్ణ,మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జే .వెంకటేశ్వరరావు,మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ నాయక్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఊట్కూరి మంజుల, ఏపిఎం అజయ్ నాయక్ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న పీహెచ్ఎన్ శశిరేఖ, వైద్యాధికారిని డాక్టర్ స్రవంతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి నకిరేకంటి రవి, రైతు వేదిక కార్యాలయంలో ఇన్చార్జ్ ఏఈఓ చైతన్య, సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుదర్శన్,గ్రామపంచాయితీ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారి బి .అనిల్ కుమార్ నాయక్ లు జాతీయ జెండాను ఆవిష్కరించినారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల సిబ్బంది, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.మండలంలోనిప్రతి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగించి స్వీట్లు పంపిణీ చేశారు.


తహశీల్దార్ కార్యాలయం, పెన్‌పహాడ్


పోలీస్ స్టేషన్, పెన్‌పహాడ్


జిల్లా పరిషత్ హైస్కూల్, పెన్‌పహాడ్


రైతువేదిక, పెన్‌పహాడ్


ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పెన్‌పహాడ్




సెర్ప్ కార్యాలయం, పెన్‌పహాడ్

# నేటి నుండి భూభారతి రెవెన్యూ సదస్సులు...

పెన్ పహాడ్/ ప్రజా ముచ్చట, జూన్ 02: నేటి నుండి భూ భారతి రెవెన్యూ సదస్సులు మండల వ్యాప్తంగా ప్రారంభిస్తున్నామని తాసిల్దార్ ధరావతు లాలు నాయక్ సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమికి సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అని ఉన్నారు. ధరణి స్థానంలో భూభారతి చట్టం అమలు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త చట్టం ద్వారా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు, వారసత్వ భూములు, సాదా బైనామాలు, ఓ ఆర్ సి వంటి సేవలు సులభతరం అవుతాయన్నారు. నేటి నుండి 12వ తేదీ వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున గ్రామాల ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహసిల్దార్ కోరారు.

**గ్రామాల వారీగా భూ భారతి రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ వివరాలు...**

**జూన్ 03 మంగళవారం: నాగులపహాడ్ (నారాయణ గూడెం), మాచారం (గూడెపుకుంట తండా),**

**జూన్ 04, బుధవారం: అనాజిపురం, రాజుపేట, లింగాల.**

**జూన్ 05 గురువారం: పొట్లపహాడ్, మహమ్మదాపురం**

**జూన్ 06 శుక్రవారం: దోస పహాడ్, ధర్మాపురం (మేఘ్యా తండా).**

**జూన్ 09 సోమవారం: సింగారెడ్డి పాలెం, భక్తాళ్ళపురం(రంగయ్య గూడెం),**

**జూన్ 10 మంగళవారం: పెన్ పహాడ్ (దుబ్బ తండ)., గాజుల మల్కాపురం (మోర్సకుంట తండా, చిన్నగారకుంట తండా).**




**జూన్ 11 బుధవారం: అనంతారం, చీదెళ్ళ(తంగళ్ళగూడెం, చెట్ల ముకుందాపురం, చిన్న సీతారాం తండా).**

**జూన్ 12 గురువారం: ఎన్. అన్నారం (ఎన్. అన్నారం బ్రిడ్జి), ధూపహాడ్ (జల్మాల్ కుంట తండా, న్యూ బంజారా హిల్స్ తండా)**

# మతిస్థిమితం లేక తప్పిపోయిన మహిళ




పెన్ పహాడ్ /ప్రజా ముచ్చట, జూన్ 02:మండల పరిధిలో మతిస్థిమితం లేక ఓ మహిళ తప్పిపోయినది. ఎస్సై కస్తాల గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తంగేళ్ల గూడెం గ్రామానికి చెందిన కుక్కడపు భాగ్యమ్మ 46 సంవత్సరాలు, భర్త చనిపోవడంతో గత ఎనిమిది సంవత్సరాలుగా చీదెళ్ళ గ్రామంలో ఉన్న ఆమె తమ్ముడు కీర్తి యలమంచయ్య వద్ద నివసిస్తూ ఉండేది. ఆమెకు ఫిట్స్ వ్యాధితో పాటు మతిస్థిమితం బాగాలేక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండేది. గత నెల మే 29వ తారీకు మధ్యాహ్నం కొబ్బరి నూనె తెచ్చుకుంటానని చెప్పి కిరాణంషాప్ దగ్గరకు వెళ్లినది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాలలో, పొలాల దగ్గర, బంధువుల ఇళ్లలో ఆమెకోసం పలుచోట్ల వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో జూన్ 1వ తారీఖున పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఆచూకీ తెలిసినవారు పెన్ పహాడ్ పోలీసు స్టేషన్ 8712686032 కు, లేదా తప్పిపోయిన మహిళ కుక్కడపు భాగ్యమ్మ తమ్ముడు కీర్తి యలమంచయ్య చీదేళ్ల, 9848511656, 8247582500 తెలియజేయగలరని కోరారు.

# ఉగ్రవాదంపై ఉక్కుపాదం...

భారత్ ఉగ్రవాదం పట్ల ఏమాత్రం సహనం చూపబోదని, ఉగ్రవాదులకు, వారికి మద్దతిచ్చే దేశాలకు మధ్య ఇకపై ఎలాంటి తేడా చూపబోదని జేడీ(యూ) ఎంపీ సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధి బృందం సోమవారం మలేషియాలో స్పష్టం చేసింది. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రదాడి గురించి, అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి ఈ బృందం మలేషియాలోని ప్రముఖ మేధోమథన సంస్థలకు, విద్యావేత్తలకు వివరించింది. భారత్ చేపట్టిన ఈ చర్య కచ్చితమైనదని, ఆచితూచి తీసుకున్నదని, బాధ్యతాయుతమైనదని, ఉద్రిక్తతలను పెంచేది కాదని ప్రతినిధులు స్పష్టం చేశారు.సోమవారం నాటి చర్చల్లో భాగంగా భారత బృందం ఏషియా యూరోప్ ఇన్ స్టిట్యూట్, ఎకనామిక్ క్లబ్ ఆఫ్ కౌలాలంపూర్, ఇన్ స్టిట్యూట్ ఆఫ్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ వంటి సంస్థల ప్రతినిధులతో సమావేశమైంది.ఈ సందర్భంగా ఒక మేధోమథన సంస్థ ప్రతినిధి తొమ్మిది మంది సభ్యులున్న భారత బృందాన్ని 'నవరత్నాలు'గా అభివర్ణిస్తూ, అఖిలపక్షంగా రావడం అభినందనీయమని అన్నారు. సీమాంతర ఉగ్రవాదంపై పోరులో భారత్ అనుసరిస్తున్న 'నూతన విధానం', కొత్త భద్రతా సిద్ధాంతం, ఉగ్రవాదంపై సమష్టి పోరులో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలపై ప్రధానంగా చర్చలు జరిగాయి.అనంతరం, భారత ప్రతినిధి బృందం మలేషియన్ ఇండియన్ కాంగ్రెస్ (ఎంఐసీ) అధ్యక్షుడు టాన్ శ్రీ డాటో శ్రీ ఎస్ఏ విఘ్నేశ్వరన్, డిప్యూటీ ప్రెసిడెంట్ వైబీ డాతుక్ సెరీ ఎం శరవణన్ నేతృత్వంలోని సీనియర్ ప్రతినిధులతో భేటీ అయింది. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ప్రదర్శితమైన ఉగ్రవాదంపై భారత్ దృఢ వైఖరిని వారికి వివరించారు. భారత గడ్డపై ఎలాంటి ఉగ్రచర్య జరిగినా గట్టిగా ప్రతిస్పందించడమే భారత్ 'కొత్త విధానం' అని స్పష్టం చేశారు. సీమాంతర ఉగ్రవాదంపై పోరులో భారత్ వైఖరికి ఎంఐసీ

# చింతలపూడి రాములు ఆశయ సాధనకై అంకితం కావాలి





**- సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ పిలుపు**

హుజూర్ నగర్,ప్రజా ముచ్చట:తెలంగాణ సాయుధ పోరాట యోధులు హుజూర్నగర్ మాజీ సర్పంచి దివంగత చింతలపూడి రాములు ఆశయ సాధనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు సోమవారం నాడు హుజూర్నగర్ సిపిఐ కార్యాలయం అనుమాల లింగయ్య భవన్లో జరిగిన చింతలపూడి రాములు 42వ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ....నీతికి నిజాయితీకి నిలువుటద్దం చింతలపూడి రాములు అని నమ్మిన ఆశయం కోసం నమ్మిన సిద్ధాంతం కోసం తన యావత్ జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని, భూమికోసం భుక్తి కోసం సాగిన ప్రపంచ ప్రఖ్యాత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఈ ప్రాంతములో నాయకత్వం వహించి నిజాం నవాబును తరిమికొట్టి మడమ తిప్పని పోరాటం చేసి నాటియువతరానికి ఆదర్శంగా నిలిచారని, హుజూర్నగర్ తాలూకాలో అనేక గ్రామాల్లో భూ పోరాటాలు చేసి ప్రభుత్వ బంచరాయి భూమిని పేదలకు పంచడంలో చింతలపూడి రాములు ది ప్రధాన పాత్ర అని గుర్తు చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, మామిడి వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవర మల్లీశ్వరి, దొంతగాని సత్యనారాయణ, సిహెచ్ సుధాకర్, యల్లావుల రమేష్,మామిడి వెంకయ్య, జడ వెంకన్న, జక్కుల శ్రీనివాస్, చేన్నగాని సైదులు, ఈ వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాస్ రెడ్డి, మామిడి నరసయ్య,జడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమం, ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ప్రజా పాలన

**- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

**- 9 వేల 326 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు**

**- భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

**- పేద ప్రజలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా**

**- ఖమ్మం జిల్లాలో నూతనంగా 5 వేల 298 కుటుంబాలకు రేషన్ కార్డ్ లు జారీ**

**- ఇందిరా మహిళా శక్తి క్రింద మహిళల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటు**

**- మా పాప - మా ఇంటి మణీ దీపం కార్య క్రమంపై జిల్లా కలెక్టర్ కు అభినందన**

**- రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న డిప్యూటీ సీఎం**

ఖమ్మం : పేదల సంక్షేమం, ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ప్రజా పాలన అందిస్తున్నామని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఖమ్మంలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం ముఖ్య అతిథి అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో పోలీసు గౌరవవందనం స్వీకరించి జాతీయ పతాకావిష్కరణ చేసి తన సందేశాన్ని ప్రజలకు తెలిపారుడిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని, భారత దేశంలోనే, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ -2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందనీ, పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి ఇన్ఫ్రా డెవలప్మెంట్, పారదర్శక సుపరి పాలన లక్ష్యాలుగా తెలంగాణ రైజింగ్ -2047 విజన్ పాలసీ రూపొందించా మన్నారు. ఈ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, టూరిజం పాలసీలను సిద్ధం చేసిందని అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ను ప్రక్షాళన చేసి, గ్రూప్ పరీక్షలు విజయ వంతంగా నిర్వహించామని, నిరుద్యోగ యువతకు భవిష్యత్తుపై ఆశలను కల్పిస్తూ ఏడాది కాలంలోనే 55 వేలకు పైగా ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేసి నియామక పత్రాలను అందజేశామని తెలిపారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణహిత ఇంధనాన్ని అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 ను రూపొందించిందని, ఇందులో భాగంగా 2030 నాటికి 20 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఆడబిడ్డలు ఆనందంగా ఉన్న ఇంట మహాలక్ష్మి తాండవిస్తుందనీ, ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందనీ, దీని ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు మహిళలకు 167 కోట్ల 89 లక్షల రూపాయలు ఆదా అయ్యాయని అన్నారు. నానాటికి పెరుగుతున్న గ్యాస్ సిలిండర్ ధరల భారం మహిళలపై పడకుండా గ్యాస్ సిలిండర్ ను సబ్సిడీ పై 500 రూపాయలకే ప్రజా ప్రభుత్వం సరఫరా చేస్తున్నదనీ, ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 2 లక్షల 42 వేల 146 కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లను సబ్సిడిపై సరఫరా చేసి సంబంధిత లబ్దిదారుల బ్యాంక్ ఖాతాలలో 26 కోట్ల 30 లక్షల రూపాయలు సబ్సిడీ సొమ్ము జమ చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు.గృహ జ్యోతి పథకం క్రింద 200 యూనిట్ల లోబడి విద్యుత్ వినియోగిస్తున్న ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తున్న దని, జిల్లాలో 130 కోట్ల 18 లక్షల రూపాయల సబ్సిడీ చెల్లించి 2 లక్షల 43 వేల 647 కుటుంబాలు లబ్ది పొందినట్లు తెలిపారు.నిరుపేదలకు ప్రభుత్వం సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశ పెట్టిందని, ఖమ్మం జిల్లాలో 9 వేల 326 మంది లబ్దిదారులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేసిందని, ఇంటి నిర్మాణ పురోగతి ప్రకారం నాలుగు దశలలో గ్రీన్ ఛానల్ ద్వారా ప్రభుత్వం లబ్ధిదారులకు నేరుగా 5 లక్షల రూపాయలు జమ చేస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు.ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మన జిల్లాలో మహిళా మార్ట్, క్యాంటీన్, 64 స్త్రీ టీ షాపులు ఏర్పాటు చేశామని, 379 లక్షల 43 వేల రూపాయలతో 613 క్యాటిల్ షెడ్లు, 57 లక్షల



13 వేల రూపాయలతో 28 పౌల్ట్రీ షెడ్లు పూర్తి చేశామని అన్నారు. మధిర నియోజకవర్గంలో మహిళల ఆర్థిక సాధికారతను పెంచేందుకు ఇందిరామహిళా డెయిరీ ప్రాజెక్ట్ చేపట్టామన్నారు. ఇందులో భాగంగా 21 వేల మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు రెండు పాడి గేదెలను ఇచ్చి, వారి నుండి పాలు సేకరించి, డెయిరీ ద్వారా ఆ పాలను విక్రయించడం జరుగు తుందని, ఇందిరా మహిళా డెయిరీ ద్వారా వచ్చే లాభాలు కూడా సంఘ సభ్యులకు జమ చేస్తామని అన్నారు..రైతు సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత కల్పించిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఖమ్మం జిల్లాలో లక్షా 31 వేల 760 మంది రైతులకు సంబంధించి రెండు లక్షల రూపాయల వరకు మొత్తం 912 కోట్ల 10 లక్షల రూపాయల రుణ మాఫీ చేసామని అన్నారు.


# విద్వేష రాజకీయాలకు 'నో' చెబుదాం....



ప్రస్తుతం మధ్యప్రదేశ్ బిజెపి ప్రభుత్వంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా క్యాబినెట్ హోదాలో ఉన్న సీనియర్ బిజెపి నాయకుడు విజరు షా మీడియాలో పతాక శీర్షికలకెక్కారు. అదేదో గొప్ప పని చేసినందుకు కాదు, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న కల్నల్ సోఫియా ఖురేషీ గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినందుకు. ఆ వ్యాఖ్యలపై దేశమంతటా దుమారం రేగింది. విజరుషా ను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేసి అతడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ కూడా వచ్చింది. చివరికి హైకోర్టు, సుప్రీం కోర్టు కూడా స్పందించాయి. కాని బిజెపి ప్రభుత్వం మాత్రం విజరుషాను వెనకేసుకొస్తూనే వుంది. అంటే రాజ్యాంగ వ్యవస్థల్ని సైతం ధిక్కరించి తమ విద్వేష రాజకీయాలను ప్రచారం చేయడానికి తయారౌతున్నారు! రాజ్యాంగ బద్ధంగా నిర్వహించవలసిన పదవుల్ని సైతం దుర్వినియోగ పరుస్తున్నారు. ఈ విజరు షా ఈ విధంగా అసభ్యకర, విద్వేషపూరిత వ్యాఖ్యలు బహిరంగంగా చేయడం ఇదేమీ మొదటిసారి కాదు. బహుశా పత్రికల్లో తన పేరు రావాలంటే ఇటువంటి అసహ్యకరమైన పనులను మళ్ళీ మళ్ళీ చేయడమే మార్గం అని అతగాడు భావిస్తున్నట్టుంది. దాదాపు పదేళ్ళ క్రితం, విజరు షా రాష్ట్ర మంత్రివర్గంలో సభ్యుడుగా ఉన్నాడు. అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భార్యపై ఒక బహిరంగ వేదిక పైనుండి అతడి సమక్షం లోనే అసభ్యకరంగా వ్యాఖ్యలు చేశాడీ విజరు షా. దానిని ప్రజానీకం తీవ్రంగా విమర్శించింది. ఆ తర్వాత తాను అలాంటి వ్యాఖ్య చేసినందుకు "పది సార్లు" క్షమాపణ కోరినట్టు విజరు షా ప్రకటించుకున్నారు. చివరికి అతడు మంత్రి పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఐతే నాలుగు నెలలు తిరగకుండానే అతడిని మళ్ళీ క్యాబినెట్ మంత్రిగా నియమించారు!2020లో విజరు షా అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు "షేరిని" అనే హిందీ సినిమా చిత్రీకరణ బాల్‌ఘాట్ వద్ద జరుగుతున్నప్పుడు అందులో నటిస్తున్న విద్యా బాలన్‌ను డిన్నర్‌కు ఆహ్వానించాడు. ఆమె ఆ ఆహ్వానాన్ని తిరస్కరించింది. దాంతో ఆ సినిమా షూటింగ్ ని ఆపేయించాడీ షా.ఇంకొక సందర్భంలో రాట్లం అనేఊరులో ఒక స్కూలులో జరుగుతున్న కార్యక్రమానికి ఇతడిని ముఖ్య అతిథిగా పిలిచారు. ఆ కార్యక్రమంలో ఆడపిల్లలకు టి-షర్ట్ లను పంపిణీ చేస్తున్నారు. ఆ సందర్భంలో షా చాలా అనుచితమైన రీతిలో "వాళ్ళకి రెండేసి టి-షర్టులివ్వండి. వాళ్ళు లోదుస్తులేం వేసుకుంటారో ఎవరికి తెలుసు?" అంటూ వ్యాఖ్యానించాడు! అతడి అసభ్యకర వ్యాఖ్యలను చివరికి స్కూలు పిల్లలు కూడా లక్ష్యం అయ్యారు.2018లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి ఏవో నాలుగు మంచి మాటలు చెప్పి పోకుండా, "ఇప్పుడు గనుక మీరు చప్పట్లు కొట్టకపోతే వచ్చే జన్మలో మీరు ఇంటింటికీ చప్పట్లు కొట్టుకుంటూ తిరిగే వారిగా పుడతారు" అంటూ మాట్లాడారు. ఉపాధ్యాయులను అవమానపరచడమే కాదు, ట్రాన్స్‌జెండర్లను కూడా అవహేళన చేసే విధంగా మాట్లాడారు.2022లో ఒక ఉపన్యాసంలో రాహుల్ గాంధీ గురించి ప్రస్తావిస్తూ అతడు బ్రహ్మచారిగా ఉండడానికి కారణం అతడికి 'మగతనం' లేకపోవడమే అంటూ చాలా నీచంగా మాట్లాడాడు.ఇప్పుడు తాజాగా కల్నల్ ఖురేషీ గురించి మాట్లాడుతూ ఆమె పాకిస్తాన్‌లో ప్రవేశించి ఉగ్రవాదులను "బట్టలూడదీసి నిలబెట్టిందంటూ" మాట్లాడాడు. అతగాడి వ్యాఖ్యల్లో అంతర్లీనంగా పదే పదే వ్యక్తమైన 'సెక్సిస్ట్" ధోరణి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఐనప్పటికీ, అతడితోపాటు ఆ బహిరంగ వేదికపై ఉన్న బిజెపి ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీమతి ఉషా ఠాకూర్‌కు మాత్రం అతడి మాటల్లో అభ్యంతరకరమైనవేవీ తోచినట్టు లేదు. ఆమె ఆ వ్యాఖ్యలకు స్టేజి పైనే పగలబడి నవ్వారు.ఇంతవరకూ పేర్కొన్న సందర్భాలను చూస్తే వాటిలో మదం, విద్వేషం, అధికార దుర్వినియోగం వ్యక్తం అవుతున్నాయి. ఇదొక ఆందోళనకరమైన ధోరణి. పదే పదే విజరు షా ఈ విధంగా వ్యవహరించడం, అతడి సిగ్గుమాలిన ధోరణిని అతడి పార్టీ ప్రశ్నించకపోవడం దీర్ఘ కాలంగా కొనసాగుతోంది.ఆర్మీ ఆఫీసర్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పకుండా అందరూ ఖండించి తీరాల్సిందే. కాని అంతటితోటే ఆగిపోతే మనకు బిజెపిలో లోతుగా వేళ్ళూనుకుని వున్న మనువాద, మహిళా-వ్యతిరేక ధోరణి కనిపించదు. విజరు షా ఒక్కడిలోనే ఈ ధోరణి కనిపిస్తోందనుకోకూడదు. అతడు బిజెపి వాస్తవ స్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. అందుకే ఒక్క ఉమాభారతి తప్ప బిజెపి లోని ఏ ఇతర మహిళా నేతా అతడి వ్యాఖ్యలను ఖండించలేదు. నిజానికి ఉషా ఠాకూర్‌తో సహా చాలా మంది మహిళా నేతలు, మంత్రులు విజరు షా ను సమర్థిస్తూ మాట్లాడారు. వారికెవరికీ అతడి వ్యాఖ్యలు అభ్యంతరకరంగా తోచలేదట! ఉమా భారతి కూడా సాటి మహిళ అయిన సోఫియా ఖురేషీపై వ్యాఖ్యానించినందుకు ఖండించలేదు. సైన్యం గురించి అలా వ్యాఖ్యానించడం తప్పు అని ఆమె భావించారు. ఆమెకున్న అతి జాతీయవాద ధోరణి ప్రకారం సైన్యం అన్ని ఇతర వ్యవస్థలకూ అతీతం. కనుక అటువంటి సైన్యం గురించి తప్పుగా, అవహేళనగా మాట్లాడడం అంటే దేశద్రోహం అవుతుంది. అందుకోసం ఆమె విజరు షా ను ఖండించవలసి వచ్చింది. మానభంగం కేసులో శిక్ష పడిన నేరస్తుడు ఆశారాం బాపు ను వెనకేసుకు వచ్చినవారిలో మొదటి వ్యక్తి ఉమాభారతి అన్న వాస్తవాన్ని మనం మరిచిపోకూడదు.మధ్యప్రదేశ్ బిజెపి శాఖలో మహిళల పరిస్థితి ఏమిటి? సాత్నా జిల్లా బిజెపి అధ్యక్షుడు తనకు అసభ్యకరంగా మెసేజ్‌లు పంపుతున్నాడంటూ ఒక మహిళా నేత ఆరోపించారు. పార్టీ ఆఫీసులో అడుగు పెట్టాలంటేనే భయంగా ఉందంటూ ఆమె వాపోయారు. సింగ్రౌలీ జిల్లా బిజెపి అధ్యక్షుడు బార్ డాన్సర్లతో అసభ్యకర నృత్యాలు చేస్తున్న వీడియో వైరల్ అయ్యింది.మోహన్ యాదవ్ ముఖ్యమంత్రి అయిన కొద్ది రోజుల్లోనే అతడు తన ఎదురుగా ఉన్న వ్యక్తి తల్లినీ, అక్కచెల్లెళ్ళనీ ఉద్దేశించి బూతులు తిడుతున్న వీడియో ఒకటి, కాంగ్రెస్ వర్కర్ల చేత "ఆంబోతు పాలు" (ఆవు పాలు కాదు సుమా) తాగిస్తానంటూ సవాలు చేసిన వీడియో మరొకటి వెలుగులోకి వచ్చాయి. ఇదీ బిజెపి సంస్కృతి. తమది సాంస్కృతిక సంస్థ అని ప్రకటించుకునే ఆరెస్సెస్ నుంచి ఎటువంటి సంస్కృతి పుట్టుకొస్తోందో దీనిని బట్టి తేటతెల్లం ఔతోంది.అందుకే ప్రధానమంత్రితో సహా ఏ బిజెపి నాయకులూ విజరు షా వ్యాఖ్యలను ఖండించలేదు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి గాని, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడికి గాని ఆ వ్యాఖ్యల్లో అభ్యంతరకరమైనవేవీ కనిపించనేలేదు. ఆ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోనేలేదు. "మురికి గుంటల్లో దొర్లేవాడు" అంటూ హైకోర్టు అతడి గురించి అన్నది. అంతేకాక అటువంటి వ్యక్తులు సైన్యానికే గాక దేశ ఐక్యతకు, మత సామరస్యానికి ప్రమాదకారులు అని కూడా అన్నది. అతడిపై దేశద్రోహ నేరం కింద చార్జిషీటు దాఖలు చేయమని పోలీసులను ఆదేశించింది. అది కూడా నాలుగు గంటల్లోపుగా అది జరగాలని ఆ న్యాయమూర్తి ఆదేశించారు. చెప్పిన గడువు లోగా ఎఫ్ఐఆర్ దాఖలు కాకుంటే డిజిపి కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టు పరిగణిస్తామని కూడా హెచ్చరించారు. అయినా సరే రాత్రి 11 గంటల తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదైంది. తీరా ఆ ఎఫ్ఐఆర్ లో ఎక్కడా వాస్తవ సంఘటనను పేర్కొననే లేదు. పైగా విజరు షా పేరు వచ్చిన ప్రతీసారీ దానికి ముందు శ్రీ అని చాలా గౌరవంగా సంబోధించారు. ఈ వైఖరి పట్ల కోర్టు తీవ్రంగా స్పందించింది. ఆ ఎఫ్ఐఆర్ రాసిన తీరు ముద్దాయిని వెనకేసుకు వచ్చేలా ఉందని, కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తోందని కోర్టు మండిపడింది.సుప్రీంకోర్టు కూడా విజరుషా ను మందలించింది. ఉన్నత పదవుల్లో ఉన్నవారు తమ మాటల విలువ ఏమిటో తెలుసుకోవాలని చెప్పింది. ఇప్పుడు షా క్షమాపణ కోరడం కేవలం మొసలి కన్నీళ్ళేనని అన్నది. ఒక సిట్‌ను ఏర్పాటు చేసి మే 28 లోగా నివేదిక తనకు ఇవ్వాలని ఆదేశించింది.ఒక్క విజరు షా యే కాదు, బిజెపిలో ఎవరికీ భారత రాజ్యాంగం పట్ల గౌరవం ఇసుమంత కూడా లేదు. ఇక ప్రజాస్వామ్యం, లౌకికతత్వం గురించి చెప్పనక్కరలేదు. మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీష్ దేవదా ఆపరేషన్ సిందూర్ జయప్రదం అయినందుకు ఉత్సవం జరుపుతూ, "దేశం యావత్తూ మోడీ గారికి వంగి నమస్కరిస్తోంది" అని ప్రకటించారు. అక్కడితో ఆగకుండా "ఈ దేశమే కాదు, మొత్తం సైనిక దళాలు కూడా మోడీకి వంగి నమస్కరించాలి" అన్నారు. ప్రజాస్వామ్యంలో అందరూ ప్రజలకి వంగి నమస్కరించాలి. కాని బిజెపి పాలనలో మాత్రం ప్రజలే పాలకులకు వంగి నమస్కరించాలన్నమాట. భూస్వామ్య సమాజంలో రాజుకు ప్రజలందరూ సేవకులే అన్న భావన ఉండేది. బిజెపి లో పేరుకుపోయిన ఫ్యూడల్ భావజాలం జగదీష్ దేవదా ప్రకటనల్లో కనిపిస్తోంది.దేశమంతా విజరు షా, జగదీష్ దేవదా ల వ్యాఖ్యలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నా, సైనిక దళాలకు రాజ్యాంగబద్ధంగా అధిపతి అయిన రాష్ట్రపతికి మాత్రం కనీసం చీమ కుట్టినట్టు అయినా లేదు.మన రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఏవీ విజరు షా వ్యాఖ్యల మీద నోరు విప్పే సాహసం చేయలేదు. మళ్ళీ వీళ్ళందరూ సినీ, రాజకీయ జీవితాల్లో హీరోలట!ఇంతగా బరితెగిస్తున్న బిజెపి కి దేశ ప్రజానీకమే తగిన విధంగా బుద్ధి చెప్పాలి. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని కోరుకునేవారు, మనువాదాన్ని భూస్థాపితం చేయగోరేవారు అందరూ నోళ్ళు విప్పాలి.

# కల్పిత ఏకాభిప్రాయ ప్రహసనం....

కారణం ఆయనకే బాగా తెలియాలి కానీ ప్రధాని నరేంద్ర మోడీ పహల్గాంలోని బైసరన్ లోయలో సాగిన అమానుష హత్యాకాండపై పార్లమెంట్‌లో జరిగిన రెండు అఖిలపక్ష సమావేశాలకూ హాజరు కావద్దని నిర్ణయించుకున్నారు. దీనిపై భారతదేశం స్పందన ఎలా వుండాలో చర్చించేందుకు జరిగిన ఆ సమావేశాలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఐక్యరాజ్యసమితి టెర్రరిస్టు సంస్థగా నిర్ధారించిన లష్కరే తోయిబాతో ముడిపడిన టెర్రరిస్ట్‌లు సాగించిన హత్యలను వారు నిష్కర్షగా ఖండించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే సరైన ప్రతిచర్యలకు తమ మద్దతు ప్రకటించారు. కాల్పుల విరమణ ప్రకటన దాకా ఈ ఏకాభిప్రాయం చెక్కు చెదరకుండా వుంది. మిలిటరీ చర్య ముగిసే వరకూ ఎలాంటి ప్రశ్నలు లేవనెత్తకుండా సంయమనం పాటించాయి.అయితే తాను, తమ ప్రభుత్వం కాల్పుల విరమణకు దోహదం చేశామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించారు. వాణిజ్యపరమైన పర్యవసానాలు వుంటాయిని తాను హెచ్చరించాకనే భారత్-పాక్ దేశాలు ఒత్తిడికి దిగివచ్చాయని చెప్పారు. ఇది ఆశ్చర్యకరమేగాక సిమ్లా ఒప్పంద స్ఫూర్తిని ఉల్లంఘించేది కూడా. సంప్రదింపులతో పరిష్కారం కోసం ప్రయత్నాలు సాగిన ఫలితంగా కుదిరిన ఒప్పందం అది. రెండు దేశాలు ద్వైపాక్షిక చర్చల ద్వారానే అన్ని వివాదాలు పరిష్కరించుకోవడానికి కట్టుబడేలా చేసింది. అయినాసరే కాశ్మీర్ సమస్యను అంతర్జాతీయ సమస్యగా మార్చేందుకు పాకిస్తాన్ నిరంతరం ప్రయత్నాలు చేస్తూనే వచ్చింది. అధ్యక్షుడు ట్రంప్ చెప్పింది పూర్తిగా యథాతథంగా తీసుకునేట్టయితే దాని ప్రకారం అది అంతర్జాతీయీకరించబడింది. దీనివల్ల వ్యూహాత్మకంగానూ దౌత్యపరంగానూ తీవ్ర పర్యవసానాలు తప్పవు.భారతీయ అధికారులు, ప్రభుత్వం కూడా ద్వైపాక్షిక చర్చల ఫలితంగానే కాల్పుల విరమణ జరిగిందని ప్రకటిస్తున్నా చెప్పుకోదగిన గందరగోళం ఏర్పడింది. ఈ ప్రకటనల విశ్వసనీయతపై నిజంగానే అనుమానాలు నెలకొన్నాయి.ఈ ప్రధాన సమస్యతోపాటు అధికారిక వివరణ రావాల్సిన ఇతర విషయాలు కూడా వున్నాయి. ఇవి ముఖ్యంగా సైనిక చర్య చుట్టూ అల్లుకుని వున్నాయి. ప్రధాన మీడియా విద్ధూరమైన నిరాధార కథనాలు ప్రచారం చేసిన ఫలితంగా ఇది మరింత అవసరంగా మారింది. వీటిలో కొన్ని వార్తా కథనాలు, మరీ ముఖ్యంగా మే 8 రాత్రి ప్రసారమైనవి ఎంత దారుణంగా నడిచాయంటే భారతీయ మీడియాను అంతర్జాతీయ సమాజం దోషిగా ఈసడించే పరిస్థితి. ఈ అవాస్తవ చిత్రీకరణలు అంతిమంగా దేశ ప్రయోజనాలకే చేటుగా పరిణమించాయి. అందువల్లనే కాల్పుల విరమణ తరువాత పార్లమెంటులో ప్రభుత్వ సాధికార ప్రకటన తప్పనిసరి అవసరంగా తయారైంది.ఐ.ఎం.ఎఫ్ యాజమాన్యం ఏ అభ్యంతరాలు లేకుండా పాకిస్తాన్‌కు లక్ష




కోట్ల డాలర్ల రుణం మంజూరు చేసినప్పుడు%ౌ%స్పష్టంగా మన దౌత్యపర వైఫల్యం కనిపిస్తుంది.ఈ నేపథ్యంలోనే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం సాధికారికంగా చేసే ప్రకటన, దానిపై సభలో క్రమబద్ధమైన చర్చను అనుమతించడం ద్వారా దేశంలో నిజమైన ఒక ఏకాభిప్రాయం రూపొందేది. అలాంటి ప్రక్రియ వల్ల పారదర్శకత వచ్చేది. రాజకీయ క్షేత్రంలో వివిధ రకాలుగా అల్లుకునిపోయిన భిన్న, బహుళ దృక్పథాలను సమ్మిళితం చేయడం సాధ్యమయ్యేది. జాతీయ ఏకాభిప్రాయం అనేది బలవంతంగా రుద్దిందో లేక కృత్రిమంగా వండిందో కాక నిజమైన రూపంలో ముందుకొచ్చేది. ఈ రూపకల్పనలో భిన్న దృక్పథాలు వ్యక్తం చేసే అవకాశముండటం ఒక కీలకమైన అంశం.అయినా సరే ప్రభుత్వం ప్రత్యేక సమావేశం జరపాలన్న కోర్కెకు సానుకూలంగా స్పందించడానికి నిరాకరించింది. కారణాలు వారికే బాగా తెలియాలి. అందుకు బదులుగా టెర్రరిజంను, దాని వెనక వున్న వారిని ఖండించడంలో రాజకీయ పార్టీలు చూపిన ఏకాభిప్రాయం విశాల జాతీయ ఏకాభిప్రాయంగా ప్రచారం చేసుకోవచ్చని భావించింది.సైనిక చర్య సందర్భంలో భారతీయులు తమ ప్రభుత్వాన్ని తామే విమర్శించారని ఒక పాకిస్తాన్ విలేకరి అడిగితే విదేశాంగ శాఖ కార్యదర్శి సరిగ్గానే స్పందించారు. భారత దేశంలో సజీవమైన ప్రజాస్వామ్యం వుంది గనక ప్రభుత్వం ప్రజలకు జవాబుదారుగా వుంటుందన్నారు. నిజంగానే భారత రాజ్యాంగం దాని లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర లక్షణాలు దేశ విదేశీ సవాళ్ళను ఎదుర్కోవడంలో మన ప్రధాన శక్తిగా వున్నాయి.ఇది దేశం తనను తాను సందర్శించుకునే సమయం. సముచితమైన పారదర్శకమైన ప్రజాస్వామిక చర్చతో ఒక నిజమైన జాతీయ ఏకాభిప్రాయం రూపొందించుకోవడంలో నిమగం కావలసిన మరో సందర్భం. దాన్ని కృత్రిమంగా తయారు చేయడం కుదరదు.ఈ పూర్వ రంగంలో ప్రభుత్వం రాజకీయ ఐక్యతను దౌత్యపరమైన చొరవకు పెంచుకునే సాధనంగా చూపించుకోవడానికి ప్రయత్నాలు చేసింది. అయితే సరైన జాతీయ ఏకాభిప్రాయం పునాదిగా లేకపోతే ఈ దౌత్యపరమైన అనుకూలత స్థిరంగా నిలబడజాలదు. అయినా భారత దేశపు నికరమైన, నిలకడైన బలం దాని రాజ్యాంగ మౌలిక విలువలలో వుంది. సీమాంతర ఉగ్రవాద సవాలును ఎదుర్కొవడానికి ఈ విలువలనే ద్విగుణీకత శక్తితో ముందుకు తీసుకుపోవాలి.

# బెడిసికొట్టిన మోడియా హడావుడి

భారతీయ మీడియా దాదాపు మోడీయా గా మారిపోయిందన్న విమర్శ చాలా కాలంగా ఉంది కూడా. కీలక అంశాల్లో సైతం వాస్తవాల పరిశీలన, లోతైన అధ్యయనం లేకుండా కేవలం కేంద్ర పాలక పక్షమైన బిజెపి, ఆర్ఎస్ఎస్ లు చేసే ప్రచారాన్ని మోత మోగించడం బడా మీడియాకు పరిపాటిగా మారింది. ప్రధానమంత్రి మోడీ పైన, ఆయన మంత్రివర్గ సహచరుల పైన, ఆయనకు సన్నిహితులైన కార్పొరేట్ అధినేతలపైన వచ్చే ఆరోపణలను ముక్తసరిగా ముగించటం బిజెపి వ్యతిరేక లౌకిక, ప్రాంతీయ పార్టీలకు సంబంధించిన ప్రతి అంశం భూతద్దంలో చెప్పడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో అన్ని వ్యవస్థలను అపహస్యం చేయడానికి కూడా బడా మీడియా వెనుకాడటం లేదు. కరోనా సమయంలో అయితే ఇది పరాకాష్టకు చేరింది. ప్రభుత్వానికి భజన చేసే మీడియాను నెత్తిన పెట్టుకోవడం ఒకటైతే విమర్శించే వారిని నిర్బంధాలపాలు చేయడం, నిషేధించడం, వేధింపులకు గురిచేయటం నిత్యకృత్యమైంది. న్యూస్ క్లిక్, వైర్ న్యూస్ లతో సహా అనేక ప్రాంతీయ మీడియాలు, నిర్భయంగా పని చేసే సంపాదకులు, జర్నలిస్టులు, రచయితలు, అధ్యాపకులు నిఘా నేత్రానికి అక్రమ కేసులకు గురికావాల్సి వచ్చింది. రాజీవ్ గాంధీ హయాంలో బోఫోర్స్ కుంభకోణం వంటిది వస్తే నెలల తరబడి కథనాలు ఇచ్చిన మీడియా అతని కంపెనీ%ౌ%అక్రమ విద్యుత్ ఒప్పందాల గురించి, అమెరికా సంస్థలు, అధికార వ్యవస్థల వివరాలు బయటపెట్టిన కేసుల లోతుపాతుల్లోకి పోకుండా పైపై వార్తలతో సరిపెట్టింది. అదే ఆంధ్రప్రదేశ్‌కు వస్తే ఇక్కడి వైసిపి, టిడిపి పరస్పరం తిట్టుకోడానికి తప్ప అసలు సమస్య వివరాల్లోకి పోకపోవడం, బలపరిచే మీడియా కూడా అలాగే వ్యవహరించడం చూస్తున్నాం. దేశం, రాష్ట్రాలకు సంబంధించిన ఈ కథలన్నీ అలా ఉంచితే ఇటీవల జరిగిన టెర్రరిస్ట్ హత్యాకాండ, భారత పాకిస్తాన్ సాయుధ సంఘర్షణ, నేపథ్యంలో భారతీయ మీడియా మరీ దారుణంగా తయారైంది. కాల్పుల విరమణ తర్వాత దేశంలోనే కాక అంతర్జాతీయంగా కూడా దాని పాత్రపై వివరమైన అధ్యయనాలు జరుగుతున్నాయి. సంచలన కథనాలు వెలువడుతున్నాయి.యుద్ధం కోసం బులపాటంబాధ్యతా రాహిత్యంతో అవాస్తవాలను, అసత్యాలను ప్రచారంలో పెట్టిన తీరుకు ప్రపంచం విస్తుపోతున్నది. భస్మాసుర హస్తంలా ఇది చివరకు తనను సృష్టించిన నరేంద్ర మోడీ సర్కారుకే ఇరకాటంగా పరిణమించింది. మోడీకి ఈ మీడియానే అతి పెద్ద ప్రతికూలాంశంగా మారిందని అల్‌జజీర్ సమగ్ర కథనాలు, చర్చలు ప్రచారం చేసింది. న్యూయార్క్ టైమ్స్ ఈ విషయం పతాక శీర్షికతో ప్రచురించింది. దేశంలో కూడా వైర్ న్యూస్ వంటి వెబ్‌సైట్లు ఫోటోలు, కథనాలు ఇచ్చాయి. ఉద్రిక్తత తారాస్థాయికి చేరిన, యుద్ధ మేఘాలు అలుముకున్న, దాడులు జరుగుతున్న ఒక పూర్వ రంగంలో మీడియా ఎంత బాధ్యతా రహితంగా వ్యవహరించిందో తెలుసుకుంటే దిగ్భ్రాంతి కలుగుతుంది. కేవలం నాలుగు రోజుల పరాకాష్టల్లో సాగిన ఈ సాయుధ సంఘర్షణపై కథనాలు ఎలా నడిచాయో వాస్తవాలు ఏమిటో వెనక్కు తిరిగి చూసుకోవడం ఇప్పుడు అందరికీ సాధ్యమే. తెలుగుతో సహా ప్రాంతీయ మీడియా కూడా ఇదే వరవడిలో సాగింది కనుక ఎవరైనా ఈ అంశం స్వయంగా పరిశీలించవచ్చు. కాకపోతే జాతీయ మీడియాలో వచ్చిన వార్తలను తాము ప్రసారం చేశామని ప్రాంతీయ మీడియాలు సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ కోట్ల మంది ప్రజలు వీక్షించే ప్రాంతీయ మీడియా బాధ్యత కూడా తక్కువ కాదు. ఒక విధంగా సామాన్య ప్రజలను చేరేది అదే గనుక మరింత ఎక్కువ బాధ్యత కూడా ఉంటుంది.అసత్యాలపై రాజ్‌దీప్ క్షమాపణభారత్ పాకిస్తాన్ ఘర్షణపై మీడియా అనుసరించిన కథనాల శైలి బయటి దేశం మీదకాక స్వదేశం మీదనే దృష్టి పెట్టినట్లు సాగిందని విమర్శకుల విశ్లేషణ. అంటే దేశంలో వీక్షకులను సంచలన కథనాలతో ఆకట్టుకొని రేటింగ్ పెంచుకోవడం మతాలవారీ విద్వేషాలు పెంచి మైనార్టీలపై ద్వేషం రెచ్చగొట్టడం అనే రెండు లక్షణాలు ఇక్కడ కనిపిస్తాయి. సాధారణంగా సోషల్ మీడియానే ఇందుకు కారణమని చెప్పడం జరుగుతుంది. కానీ ఈ ఘర్షణ సమయంలో ప్రధాన మీడియా అన్నది కూడా ఇందుకు మినహాయింపు కాకపోవడం ఆందోళనకరం. ఆర్ణబ్ గోస్వామి రిపబ్లిక్ టీవీ వంటివి టీవీ స్టూడియోలను యుద్ధ రంగాలుగా మార్చేశాయి. తుపాకుల బొమ్మలు, ఆయుధాలు, చెట్లు నమూనాలతో మరింత ఉద్రిక్తతకు కారణమయ్యాయి. దాడులపై నిరాధారమైన కథనాలిచ్చాయి. ఇది ఎంతవరకు పోయింది? ఏ స్థాయిలో సాగింది? అంటే సీనియర్ సంపాదకుడైన రాజ్‌దీప్ సర్దేశారు ఆధారం లేని కొన్ని కథనాలు చెప్పినందుకు క్షమాపణలు చెప్పుకోవాల్సి వచ్చింది. ఆర్ణబ్ గోస్వామి అందుకు సిద్ధపడలేదు కానీ ఘోరంగా రెచ్చిపోయి వ్యవహరించారు. ఇక్కడ చెప్పుకోవాల్సింది ఏమంటే పాకిస్తాన్ మీడియా కూడా అందుకు ఏమాత్రం తీసిపోని విధంగా అసత్య కథనాలతో ఆవేశం పెంచడానికి పనిచేసింది. ఆ మీడియాని గనుక నమ్మినట్లయితే ఢిల్లీపై దాడి జరిగిందని భావించాల్సి వచ్చేది.ఆర్ణబ్ గోస్వామి కథనాల ప్రకారం 400 డ్రోన్లను భారత సైన్యం ఒక్క దెబ్బతో పేల్చివేసింది. పాకిస్తాన్‌లో సైనిక కుట్ర జరిగిపోయింది. దాడి కకావికలం చేసింది. ఐఎన్ఎస్ విక్రాంత్ బయల్దేరి కరాచీ రేవును ధ్వంసం చేసింది. ఇండియా న్యూస్ టీవీ కథనం ప్రకారం లాహోర్ ధ్వంసమైంది. ఎన్.డి టివి కథనం ప్రకారం ట్యాంకులు కూల్చివేయబడ్డాయి. 17 జె.ఎఫ్ విమానాలను, ఎఫ్ 16 విమానాలను పాకిస్తాన్ నుంచి భారత సైన్యం పట్టుకున్నదని ఇండియా టుడే కథనం ప్రసారం చేసింది. ఆజ్ తక్ చానల్‌లో అంజనా మిశ్రా, శ్వేతా కశ్యప్ ఆవేశపూరితమైన కథనాలు ఇవ్వటమే కాకుండా పాకిస్తాన్ సూసైడ్ దళాలు సైన్యంపై దాడికి కుట్ర పన్నాయని ప్రసారమైంది. ఎ.బి.పి, జీ న్యూస్ లు పాక్ సైనిక దళాల ప్రధాన అధికారి మునీర్‌ను తొలగించేసినట్టు ప్రసారం చేసింది. 450 మంది ప్రైవేట్ సైన్యం దాడి చేస్తున్నట్లుగా అజరు శర్మ కథనం ఇచ్చారు. ఉదాహరణలు చెప్పాలంటే స్థలాభావం అడ్డొస్తుంది. ఇలాంటి కథనాలతో రాజస్థాన్ సరిహద్దుల్లో ప్రజలు చాలా ఆందోళన చెందారని కూడా తర్వాత బయటకు వచ్చింది. ఈ వివరాలన్నింటి నిజానిజాలను ఆల్ట్ న్యూస్, క్వింట్ వంటివి బయటపెట్టాయి. పంజాబ్ కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ శర్మ ఈ అసత్య కథనాల సుదీర్ఘ జాబితాను తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు